క్లుప్తంగా

సీఎంను కలసిన మున్సిపల్ చైర్‌పర్సన్



హిందూపురం: అనంతపురం జిల్లా నార్పల పర్యటనలో భాగంగా బుధవారం పుట్టపర్తి విమానాశ్రయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ కలిశారు. పుష్పగుచ్ఛంతో పాటు బైబిల్‌ను సీఎంకు అందించారు. అనంతరం ఆయనతో సెల్ఫీ తీసుకున్నారు.

నేడు గంధం వేడుక

పెనుకొండ: పట్టణంలోని ఖ్రమూద్దీన్ ఆలీ దర్గాలో గురువారం తెల్లవారుజామున గంధం వేడుకలు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు ఖలీముల్లా తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి అద్దాలు అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: మండల పరిధిలోని మలుగూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో ఎన్‌పీసీబీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేబీ హళ్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం గ్రామ సచివాలయం పరిధిలోని ఆర్ అనంతపురంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు.

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని యర్రమంచి పంచాయతీలోని హరిపురం, కురుబ వాండ్లపల్లి గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని సర్పంచ్ నాగమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ పని



మాట్లాడుతున్న పీడీ రామాంజినేయులు

మడకశిర రూరల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య మరింత పెంచాలని డ్వామా పీడీ రామాంజనేయులు సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన మడకశిర మండలం ఆమిదాలగొంది పంచాయతీలో జరుగుతున్న 'అమృత్ సరోవర్' పనులను పరిశీలించారు. పని చేసే చోట సౌకర్యాలు కల్పిస్తున్నారా... అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. జాబ్ కార్డు ఉన్న కూలీలంతా పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీలో రోజు వారీ వేతనం రూ.272 వచ్చేలా పనులు కల్పిస్తామన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ, కూలీలకు పనులు కల్పించక పోతే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమై సూచనలు, సలహాలిచ్చారు.

పెనుకొండ: ఉపాధి హామీ పథకం కింద ప్రతి కూలీకి పని కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ రామాంజినేయులు ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు? ఇతర వివరాలను ఆరాపై తీశారు.

ఉపాధి పనులపై సమీక్ష

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత వారంలో జరిగిన పనులు, మస్టర్ తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

హిందూపురం టౌన్: ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి పట్టణంలోని గాయత్రి దేవాలయంలో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న రమేష్ అనే యువకుడు ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రంగా గాయాలపాలైన అతడిని స్థానికులు గుర్తించి 108 అంబులెన్సులో హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టండి

- మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



కళ్లగేరి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. ఉనికే ప్రశ్నార్థకంగా మారిన ప్రతిపక్ష పార్టీలు 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని విమర్శించారు. వారి కుట్రలను ప్రజలు తప్పి కొట్టి పేదలకు మంచి చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలన్నారు. మండలంలోని మల్లాపల్లి పంచాయతీ పరిధిలోని కళ్లగేరి గ్రామంలో సర్పంచ్ శివానంద నేతృత్వంలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే శంకరనారాయణ ప్రతి గడపకూ వెళ్లి పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటిని సత్వరం పరిష్కారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో పేదలకు దక్కాల్సిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలు పచ్చచొక్కలకే పరిమితం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు రేషన్‌కార్డులు, సామాజిక భద్రత పింఛన్లు అందలంటే జన్మభూమి కమిటీ సభ్యులకు కప్పం కట్టాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుల,మత, రాజకీయలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, ఎంపీటీసీ మబుసాహెబ్, స్థానిక నాయకులు లక్ష్మిరెడ్డి, ఉసేన్, వేమారెడ్డి, రవీంద్రారెడ్డి, ఆదినారాయణప్ప, నాగిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుక



హిందూపురంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ జన్మదిన వేడుకను నియోజకవర్గం వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత బీపీఎల్ షోరూం ఎదుట మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని చేపట్టారు. ముందుగా భారీ కేక్ కత్తిరించి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఆ తర్వాత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ కష్టాల్లో ఎవరున్నా సరే ఆదుకునే గొప్ప మనసున్న నాయకుడు, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ జన్మదిన వేడుక జరుపుకోవడం చాలా సంతోషకరమన్నారు. ఎమ్మెల్సీ 66 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా 66 మంది అభిమానులు రక్తదానం చేసి మరోకరికి ప్రాణదాతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు గిరీష్, మల్లికార్జున, చిన్నమ్మలతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు లోకేష్, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, మార్కెట్ చాందు తదితరులు పాల్గొన్నారు

జోరుగా సేవా కార్యక్రమాలు

ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, వార్డు కన్వీనర్లు పెద్ద ఎత్తున ఆయా వార్డుల్లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. మల్లికాభాను కొడిగినహళ్లి అంధుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం చేశారు. 30వార్డులో కోఆప్షన్ సభ్యులు రహమత్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే నాయకులు ఫకృద్దీన్ స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బండ్లపల్లి జబి రహమత్‌పురంలో పారిశుధ్య కార్మికులతో కలిసి కేక్‌కత్తిరించి మిఠాయిలు పంపిణీ చేశారు.

చిలమత్తూరు: ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ జన్మదిన వేడుకను చిలమత్తూరులోని బస్టాండు దగ్గరున్న వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు తిరుమలేశ, మురళి, ఎంపీటీసీలు జగన్‌మోహన్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి , జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఎం.హేమలత, రొళ్ల



డి.మిత్రశ్రీ, రొళ్ల



ఐశ్వర్య, రొళ్ల



ఎస్.షాజియా, హిందూపురం



ఎం.చాందిని, హిందూపురం

హిందూపురం టౌన్: ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 145 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 63.44 శాతంతో 92 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఒకేషనల్ గ్రూప్‌లో 98 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 70.4 శాతంతో 69 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో జనరల్ విభాగంలో 54.43 శాతం, ఒకేషనల్ విభాగంలో 55.8 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సీఈసీ విభాగంలో 962 మార్కులతో ఎస్.షాజియా, బైపీసీలో 954 మార్కులతో ఎం.చాందిని, ఎంపీసీ విభాగంలో 927 మార్కులతో ఎస్.షహిస్తా ఫిర్దోస్, హెచ్‌సీఎంఎల్ (యూ) గ్రూప్‌లో 893 మార్కులతో ఎస్.సుహానా, హెచ్‌ఈసీ విభాగంగా 703 మార్కులతో ఎం.గంగ్రోతిలు టాపర్లుగా నిలిచారు. అలాగే ఒకేషనల్ గ్రూప్‌లో ఈఈటీలో 974 మార్కులతో కె.హుస్నా, ఎంఎల్‌టీలో 961 మార్కులతో పి.చైత్ర, సీఈటీలో 953 మార్కులతో ఎస్.సలీమా, ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్)లో 946 మార్కులతో ఈ.హర్షితలు టాపర్లుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ మురళీమోహన్ తెలిపారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఇంటర్ ఫలితాల్లో సీ.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు. ఫస్ట్ ఇయర్ 50 శాతం, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 62.26 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. ఎంపీసీ విభాగంలో శ్రావణి 797 , బైపీసీ విభాగంగా బీ మేఘన 683, సీఈసీ విభాగంలో డీ.ఉదయశ్రీ 830 , ఎంఈసీ విభాగంలో కె.చరణ్ తేజ్ 885 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు.

రొళ్ల: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రొళ్ల మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆవినకుంట కేజీబీవీ కళాశాలలో 27 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 22 మంది (81 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బైపీసీ విభాగంలో ఎం.హేమలత 931 మార్కులు, డి.మిత్రశ్రీ, ఐశ్వర్య 924 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు కేజీబీవీ ఎస్ఓ ఎస్.మున్వార్‌జాన్ తెలిపారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బషీర్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో జనరల్‌లో 85 మందికి 32 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ కోర్సులో 108 మందికి 43 మంది పాసయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 136 మందికి 80 మంది పాసయ్యారని, వృత్తి విద్యాకోర్సులో 119 మందికి 63 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.

లేపాక్షి: లేపాక్షిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 49 మందికిగాను 9 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే రెండో సంవత్సరం ఇంటర్ పరీక్షల్లో 59 మందికిగాను 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మొదటి సంవత్సరం ఇంటర్‌లో 15 మంది విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని స్పెషల్ ఆఫీసర్ నీలిమా తెలిపారు. సెకండ్ ఇంటర్‌లో 35 మంది విద్యార్థులకుగాను 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. బైపీసీ గ్రూపులో దివ్యశ్రీ 907 మార్కులు, నందిని 901 మార్కులు సాధించినట్లు తెలిపారు.



ఉష్ణోగ్రత సమాచారం

(గరిష్టం)

హిందూపురం	36.0
పెనుకొండ	38.0
మడకశిర	36.0

'పురం' డీఎస్పీగా కంజాక్షన్



హిందూపురం: హిందూపురం డీఎస్పీగా పి.కంజాక్షన్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. హిందూపురం పోలీసు సబ్‌డివిజన్ ఏర్పడక తొలి డీఎస్పీగా కంజాక్షన్ నియమితులయ్యారు. ఏసీబీ డీఎస్పీగా ఉన్న ఆయనను హిందూపురంకు బదిలీ చేశారు. ఇన్నేళ్లు పెనుకొండ సబ్ డివిజన్‌లో ఉన్న హిందూపురం... కొత్త జిల్లాలు ఏర్పడక సబ్ డివిజన్‌గా మారింది. హిందూపురం సబ్ డివిజన్ కింద నాలుగు సర్కిళ్లు, ఆరు పోలీస్‌స్టేషన్లు, ఒక ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఉన్నాయి.

గోమాతకు అంత్యక్రియలు



మృతి చెందిన గోమాతకు పూజలు చేసిన గ్రామస్తులు

రొద్దం: మండల కేంద్రంలో ప్రతిరోజూ ఉదయం ఇంటింటా పూజలు అందుకుంటున్న రొద్దకాంబదేవి గోమాత పేరుతో పిలిచే ఆవు అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. దీంతో గ్రామస్తులు బుధవారం గోమాతకు సంప్రదాయ పద్ధతులతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆవు మృతదేహాన్ని గ్రామంలో ఊరేగించి ఖననం చేశారు. ప్రతిరోజూ మహిళలు ఉదయం తమ ఇంటి వద్దకు వచ్చిన గోమాతకు పూజలు చేసేవారు. పూజలు అందుకున్న తరువాతే ఆ ఇంటి వద్ద నుంచి మరో ఇంటి వద్దకు ఆవు కదిలేదని గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

అటవీ ప్రాంతం తనిఖీ

పెనుకొండ: పెనుకొండ కొండపల్లి అటవీ ప్రాంతాన్ని సీసీఎఫ్ రవీంద్రనాథరెడ్డితో పాటు ఇతర అధికారులు బుధవారం పరిశీలించారు. అటవీ ప్రాంతంలో ప్లాంటేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. అటవీ ప్రాంతాన్ని కాపాడటంలో సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

సోమందేపల్లి: మండలంలోని మండ్లి గ్రామంలో నివాసం ఉంటున్న రాధమ్మ అనే మహిళ ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఇల్లు దగ్ధమైంది. విద్యుత్ మీటర్ వద్ద మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. దీంతో టీవీ, ఎలక్ట్రానిక్ పరికరాలు, పిల్లల స్కూల్ సర్టిఫికెట్లు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు వాపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

రెండిళ్లలో చోరీ

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటాపురం తండాలో మంగళవారం రాత్రి రెండిళ్లలో చోరీలు జరిగాయి. తండాకు చెందిన లచ్చీరాంనాయక్‌తో పాటు శ్రీనివాస్‌నాయక్ అనే వ్యక్తుల ఇళ్లలో చోరీలు జరిగాయి. బాధితుల కథనం మేరకు... సోమందేపల్లి మండలం గుడిపల్లిలో తమ సోదరి చనిపోవడంతో లచ్చీరాంనాయక్‌తో పాటు కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు వెళ్లారు. శ్రీనివాస్‌నాయక్ కుటుంబ సభ్యులు పాలసముద్రం సమీపంలో జాతర ఉండటంతో వెళ్లారు. దీంతో దుండగులు రాత్రి వాళ్ల ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారు సొమ్ములను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలాలను పరిశీలించారు. పోలీసులు తగిన నిఘా ఉంచకపోవడంతోనే చోరీలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

సోమందేపల్లిలో...

సోమందేపల్లి: మండల కేంద్రంలోని సాయినగర్‌లో నివాసముంటున్న లక్ష్మి నారాయణ ఇంట్లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. వేడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో కుటుంబ సభ్యులు మిద్దెపై నిద్రించారు. ఇదే సమయంలో ఇంటి తలుపులు పగల కొట్టి రూ.50 వేల నగదు, రెండున్నర తులాల బంగారం ఎత్తు కెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హ్యూందాయ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యంగ్‌వాన్‌చంగ్

లేపాక్షి: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ గురుకుల పాఠశాలలో హ్యూందాయ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యంగ్‌వాన్‌చంగ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జావాన్‌చో, కోఆర్డినేటర్ కంభం మంజులరెడ్డి బుధవారం వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. హ్యూందాయ్ మెటీరియల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారిచే పాఠశాలకు రూ.6.43 లక్షలు విలువ చేసే 1000 లీటర్ల వాటర్ ప్లాంట్, ఎప్సాన్ ప్రొజెక్టర్లు - 4, కానన్ ప్రింటర్, వెయిటింగ్ కుర్చీలు 4 చొప్పున అందజేశారు. ఇందులో భాగంగానే వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హ్యూందాయ్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ కంపెనీ నుంచి పాఠశాలకు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌మూర్తి, కమిటి చైర్మన్ రామాంజినేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి



ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం, ఛత్రం గ్రామ సచివాలయాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను బుధవారం డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ మంజువాణి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్య సేవలను అందించాలన్నారు. అనంతరం రేకులకుంట గ్రామంలో నిర్వహించి వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ సేవలను పరిశీలించారు. ప్రజలకు గ్రామంలోనే వైద్య చికిత్సలు అందించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. వైఎస్సార్ ఫ్యామిలి డాక్టర్ సేవలను గ్రామస్థాయిలోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధుర్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ శిక్షణ తరగతులకు డుమ్మా

- దూరంగా ఉన్న ఈరన్న వర్గం
- పనిచేయని హైకమాండ్ ఆదేశాలు

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మంటపంలో బుధవారం నియోజకవర్గస్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ శిక్షణ తరగతులకు పార్టీ కోఆర్డినేటర్ గుండుమల తిప్పేస్వామి అధ్యక్షత వహించారు. అయితే ఈశిక్షణ తరగతులకు మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గం నాయకులు, కార్యకర్తలు ఎవరూ కూడా హాజరుకాలేదు. ఈరన్న వర్గానికి చెందిన ముఖ్య నాయకులు కూడా శిక్షణ తరగతులకు డుమ్మా కొట్టడంతో పార్టీ కోఆర్డినేటర్ గుండుమల తిప్పేస్వామి వర్గం నాయకులు ఖంగుతిన్నారు. పార్టీ హైకమాండ్ కలిసి పని చేయాలని రెండు వర్గాల నాయకులకు ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇటీవలనే మాజీ ఎమ్మెల్యే ఈరన్నను హైకమాండ్ ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని నియమించింది. దీంతో రెండు వర్గాల మధ్య మరింత దూరం పెరిగింది. మాజీ ఎమ్మెల్యే ఈరన్న, పార్టీ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి వర్గాలకు నియోజకవర్గంలో సమబలం ఉండడంతో కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలీక అయోమయంలో ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

బ్యాంకు నిర్వహణపై అవగాహన



లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్

మడకశిర(అగళి): ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా అగళిలోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు బుధవారం కర్ణాటక బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకు నిర్వహణపై మేనేజర్ హరికిశోర్, ఆఫీసర్ మధుసూదన్, క్లర్క్ హరీష్ తదితరులు విద్యార్థులకు వివరించారు. బ్యాంకులో లావాదేవీలు ఎలా జరపాలి, డబ్బులను ఖాతాల్లో ఎలా జమ చేయాలి, ఎలా విత్‌డ్రా చేయాలి తదితర అంశాలపై విద్యార్థులకు బ్యాంకు సిబ్బంది అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ చక్రధారి, అధ్యాపకుడు క్రిష్ణమూర్తి, ట్రైనర్ చంద్రబాబునాయుడు తదితరులు హాజరయ్యారు.

కాంగ్రెస్‌కు మైలారరెడ్డి రాజీనామా



పావగడ: స్థానిక సీనియర్ కాంగ్రెస్ నేత, రాజ్య ఓబీసీ కమిటీ ప్రధాన కార్యదర్శి మైలారరెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీకే కాకుండా తన పదవికి సైతం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప, ఆయన కుమారుడు వెంకటేశ్ నియంతృత్వ ధోరణి సహించలేకనే పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. యాదవ సామాజిక వర్గాన్ని కించ పరిచే విధంగా మాట్లాడిన వెంకటేశ్ వైఖరి తనను బాధించిందన్నారు. యాదవ సంఘం నాయకులు బాలాజీ , లక్ష్మి నరసప్ప, నల్లప్ప, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆధార్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, ఏఓ నబీరూసూల్ తెలిపారు. బాలల ఆధార్ కార్డు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు, పదేళ్లుగా ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారుంటే అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయం

పావగడ: స్థానిక బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్‌ను గెలిపించాలని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ యాదవ్ కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణానాయక్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పావగడ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతామన్నారు.

బిందు, తుంపర సేద్యంపై అవగాహన

మడకశిరరూరల్: మండల పరిధిలోని చెండకచెర్లు గ్రామంలోని రైతు పంట పొలాల్లో బుధవారం ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో బిందు, తుంపర సేద్యం వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం మంజూరు చేసిన డ్రిప్ పరికరాలను రైతు పొలంలో అమర్చిన యూనిట్‌ను ఎంఐఏఓ నరసింహులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యం పరికరాలు వాడకం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటసాగు చేసి అధిక దిగుబడిని పొందవచ్చని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను మంజూరు చేస్తోందని , నియోజకవర్గంలోని రైతులందరూ డ్రిప్ పరికరాలను బిగించుకొని అధిక దిగుబడులు సాధించి లాభాల్లోకి రావాలని సూచించారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠేశ్వరస్వామి సముదాయ దేవాలయాలను బుధవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ సందర్శించారు. అనంతరం నీలకంఠేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు.

మొక్కల పెంపకంతోనే కాలుష్య నివారణ



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మడకశిరరూరల్: మొక్కల పెంపకం ద్వారానే కాలుష్యాన్ని నివారించవచ్చని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమకుమార్ తెలిపారు. మండల పరిధిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా బుధవారం ఆర్ అనంతపురం గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా, పాఠశాల ఆవరణంలో వివిధ రకాల మొక్కలు నాటి నీరు పోశారు. మొక్కలు పెంపకం ద్వారా కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినమ్మ, పీఓ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.